క్లుప్తంగా

చెక్కులు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని జగ్గారం గ్రామానికి చెందిన దూదిమెట్ల కోటేశ్వరరావుకు రూ.48వేలు, అశ్వాపురం గ్రామానికి చెందిన చిలక సుభద్రకు రూ.38వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం సర్పంచ్ సున్నం రాంబాబు, నాయకులు ఈదర సత్యనారాయణ, సూదిరెడ్డి గోపిరెడ్డి, గద్దల రామకృష్ణ, లంకెల రమేష్, ఎస్కే.నయీం, గడకారి రామకృష్ణ, జూపల్లి కిరణ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వేటాడితే కఠిన చర్యలు

గుండాల: అడవుల్లో నివసిస్తున్న మూగజీవులను వేటాడినా, కరెంటు పెట్టి చంపినా వారిపై కఠిన చర్యలు తప్పవని గుండాల సీఐ రవీందర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చుట్టుపక్క అడవుల్లో కరెంటు తీగలు తగిలించినా, నీరు నిలువ ఉన్న చోట పురుగుమందులు కలిపినా, రాత్రి వేళల్లో వేటకు వెళ్లినా వారిపై నిఘా ఉంటుందన్నారు. వన్య ప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టినా వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతేకాకుండా ఈ తీగలు మూలంగా మేతకు వెళ్లే ఆవులు, మేకలు, పశువుల కాపరులకు ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. నాటు తుపాకులతో, బాణాలతో వేటాడినా చర్యలు తప్పవని తెలిపారు. సమావేశంలో ఎస్సై కిన్నెర రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

దుమ్ముగూడెం: క్రీడా పోటీలు మానసికోల్లాసాన్ని కలుగజేస్తాయని, దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని రిటైర్డ్ ఏపీపీ కోటా దేవదానం అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కేవీ ఫౌండేషన్ ఆర్థికసాయంతో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగ అవకాశాలను సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ రేసు ఆదినారాయణ మూర్తి, ఏఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, ఏటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, జీఎస్పీ నాయకుడు ముర్రం వీరభద్రం, ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లుదొర, ఏఎస్పీ నాయకుడు నూపా సీతయ్య, సర్పంచ్ గుండి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కొర్సా రామచంద్రయ్య పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం

అశ్వాపురం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పినపాకలో గెలుపే లక్ష్యంగా శ్రీనన్న సైన్యం, ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సూచించారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు, వెంకటాపురం, గొందిగూడెం, గొందిగూడెంకొత్తూరు, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గ్రామాల్లో పొంగులేటి శ్రీనన్న సైన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గ్రామ కమిటీలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచ్ పాయం భద్రమ్మ, ఉపసర్పంచ్లు కాటిబొయిన నరేష్, రాంప్రసాద్, వార్డు సభ్యులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షర్ఫియుద్దీన్, నాయకులు ముత్తినేని వాసు, యక్కటి సత్యనారాయణరెడ్డి, పున్నారెడ్డి, తెల్లం వీరభద్రం, కొండలరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

గుండాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో పువ్వాడ ఫౌండేషన్, మమత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం బుధవారం విజయవంతంగా నిర్వహించారు. శిబిరానికి మండలంలోని గ్రామాల ప్రజలు సుమారు 250 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అకౌంట్స్, ప్రోగ్రాం ఆఫీసర్ కె.భానుచందర్ హాజరయ్యి పరిశీలించారు. కార్యక్రమంలో దామరతోగు ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, గుండాల ఉపసర్పంచ్ మానాల ఉపేందర్, మమత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సిబ్బంది, నవచైతన్య యువజన సంఘం అధ్యక్షుడు ఎస్కె.ఆజాద్, సభ్యులు బత్తిని వినయ్, కోడూరి ప్రణయ్, మండలోజు వినయ్, కందుకూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కుమారుడి వివాహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం దివంగత ఎమ్మెల్యే సున్నం రాజయ్య చిన్న కుమారుడు సున్నం సీతారామరాజు వివాహం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్పురం మండలంలోని సున్నంవారిగూడెంలో బుధవారం జరిగింది.

వేడుకలకు సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్రావు, బి.వెంకట్, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, అన్నవరపు కనకయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే.రమేష్, ఎంబీ.నర్సారెడ్డి, కొలగాని బ్రహ్మచారి, కొక్కెరపాటి పుల్లయ్యతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తొలుత రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పిడుగుల కాలం.. జర పైలం

- అకాల వర్షాలతో పిడుగుపాట్లు అధికం
- బాధితులుగా మారుతున్న రైతులు, జీవాలు
- జాగ్రత్తలు పాటిస్తేనే మేలు



అశ్వాపురం మండలంలో పిడుగు పడి కాలిపోతున్న తాటిచెట్టు (ఫైల్)



నకిలిపేట గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన జీవాలు (ఫైల్)

బూర్గంపాడు: ఇటీవల అకాల వర్షాలు కురుస్తున్నాయి. విపరీతమైన గాలులు, ఉరుములు, మెరుపులతో వానలు దంచికొడుతున్నాయి. ఈ తరుణంలో పలుచోట్ల పిడుగులు పడుతున్నాయి. గాలివాన తీవ్రతకు పొలం పనుల్లో ఉండే రైతులు, పశువుల కాపర్లు చెట్లకిందకు చేరుతున్నారు. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై మనుషులు, పశువులు, జీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఉరుములు, మెరుపుల సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నుంచి తప్పించుకునే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఏటా ఘటనలు..

పిడుగుపాటుకు జిల్లాలో ప్రతి ఏటా పొలం పనుల్లో ఉండే రైతులు, కూలీలు, పశువులు, జీవాలు మృత్యువాత పడుతున్నాయి. గత ఏడాది పిడుగుపాటుకు జిల్లాలో ఐదుగురు మృతిచెందారు. 54 పశువులు, 100కు పైగా జీవాలు మృత్యువాత పడ్డాయి. సమీపంలో పిడుగు పడటంతో విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయి. ఇటీవల వాతావరణశాఖ శాటిలైట్ నివేదికలతో పిడుగులు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను తెలియజేస్తోంది. సామాజిక మాధ్యమాలలో కూడా పిడుగులు పడే ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అందులో భాగంగా పిడుగుపాటు నుంచి తప్పించుకోడానికి పాటించాల్సిన మెలుకువలు తెలుసుకోవాల్సి ఉంది.

జాగ్రత్తలు ఇవీ..

ఉరుములు, మెరుపులు వస్తున్న తరుణంలో పొలం పనుల్లో ఉన్న రైతులు, కూలీలు ఎట్టి పరిస్థితుల్లో చెట్లకిందకు వెళ్లకూడదు. సమీపంలో ఏదైనా షెల్టర్ ఉంటే అందులోకి వెళ్లాలి. షెల్టర్ దొరక్కుంటే ఎత్తు తక్కువగా ఉండే ప్రాంతంలో కూర్చుని తల కిందకు వంచి చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలి. పొలాల్లో మేతకు వెళ్లిన పశువులు, జీవాలు చెట్లకు కిందకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ తరుణంలో పశువులను ఆరుబయట ఉంచకుండా పశువుల పాకలలో, షెడ్లలో కట్టేసుకోవాలి. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో టీవీలు, ఇతర విద్యుత్ గృహోపకరణాలను బంద్ చేయాలి. స్విచ్ బోర్డుల నుంచి ప్లగ్లను తీసి వేయాలి. లేకుంటే సమీపంలో పిడుగు పడితే ఎలక్ట్రికల్ వస్తువులన్నీ దగ్ధమయ్యే అవకాశముంది. ఉరుములు, మెరుపుల సమయంలో ల్యాండ్ఫోన్ మాట్లాడకూడదు. ఉరుములు, మెరుపుల వేళ మన శరీరం జలదరింపుకు గురైన, వెంట్రుకలు నిక్కబొడుచుకున్న సమీపంలో పిడుగుపడే అవకాశం ఉన్నట్లుగా భావించి తగు జాగ్రత్తగా ఉండాలి.

పరిహారానికి నోచుకోని బాధితులు

పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన రైతులు, కూలీలకు, పశువుల కాపారులకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందటంలో తీవ్రజాప్యం జరుగుతోంది. ఏళ్లతరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి సాయం మాత్రం దక్కటం లేదు. అదేవిధంగా పశువులకు, జీవాలకు ఇన్సూరెన్స్ ఉంటే తప్ప ఎలాంటి పరిహారం అందటం లేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.

జాగ్రత్తగా వ్యవహరించాలి



అకాల వర్షాలు కురిసే సమయంలో పిడుగుపాటుకు ఎక్కువగా అవకాశాలున్నాయి. ఉరుములు, మెరుపులు వస్తున్న సమయంలో పొలం పనుల్లో ఉండే రైతులు, కూలీలు, పశువుల కాపరులు తగు జాగ్రత్తగా ఉండాలి. చెట్లు, ఎత్తైన టవర్ల కిందకు వెళ్లకూడదు. ఉరుములు, మెరుపులు ఉన్న తరుణంలో సమీపంలో ఉన్న షెల్టర్లలోకి వెళ్లాలి.

– డాక్టర్ రవీందర్, మండల పశువైద్యాధికారి

ఉద్యోగుల రక్షణే ప్రధానం



మాట్లాడుతున్న ఎస్ఈ రమేష్

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ ఉత్పత్తి, సరఫరాతోపాటు సంస్థలో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది రక్షణే ప్రధానమని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేష్ అన్నారు. స్థానిక సబ్ డివిజనల్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వారోత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ను అందించడంతోపాటు, సంస్థ కోసం నిత్యం కష్టపడే ఉద్యోగులు, కార్మికులు, శ్రామికులు, సిబ్బందిని ప్రమాదాల నుంచి కాపాడుకోడం, వారికి భద్రత కల్పించడం ముఖ్యమని చెప్పారు. అనంతరం విద్యుత్ సంస్థలో పని చేస్తున్న సిబ్బందికి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీఈ టి.శేషాద్రి, ఏడీఈ వెంకటేశ్వర్లు, ప్రొటక్షన్ ఏడీ రవి, ఏఈలు, ఆర్టిజన్ కార్మికులు పాల్గొన్నారు.

పోరాట ఫలితమే తునికాకు బోనస్

చర్ల: తునికాకు కార్మికులకు పెండింగ్ బోనస్ విషయమై పలుమార్లు సీపీఐ చేసిన ఆందోళన ఫలితంగానే బోనస్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసిందని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కల్లూరి వెంకటేశ్వరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన చర్లలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి కేసీఆర్కు వివరించి బోనస్ విడుదలయ్యేలా చేశారన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నూపా పోతయ్య, జిల్లా సమితి సభ్యులు అడ్డగర్ల తాతాజీ, మండల సహాయ కార్యదర్శి కొంగూరు రాము నాయకులు నూపా తిరుపతిరావు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: సీపీఐ అనుబంధ సంఘమైన తెలంగాణ గిరిజన సమైక్య పోరాట ఫలితమే భద్రాచలం డివిజన్కు రూ.30కోట్ల తునికాకు బోనస్ విడుదల అని సంఘం జాతీయ కమిటీ సభ్యుడు కుంజ శ్రీనివాసరావు అన్నారు.

బుధవారం పెద్దనల్లబెల్లి గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనస్కు సంబంధించి యావత్ జిల్లాల కంటే భద్రాచలం డివిజన్కు ఎక్కువ బడ్జెట్ కేటాయించారని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మట్ట నరసింహారావు, కుంజ లక్ష్మీనారాయణ, తెల్లం శ్రీను, కల్లూరు శ్రీనివాస్, గుండి ప్రదీప్, కుంజ శ్రీనివాస్, కల్లూరి చెంచయ్య, కుంజ ఆదెమ్మ, కోడి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య బైక్యాత్ర

బూర్గంపాడు: కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రో, గ్యాస్ ధరలను నిరసిస్తూ భద్రాచలానికి చెందిన తూతిక ప్రసాద్ చేపట్టిన జనచైతన్య బైక్యాత్ర బుధవారం మండలంలో కొనసాగింది. మార్చి 10న ప్రారంభించిన ఈ పాదయాత్ర 17 జిల్లాలో 4,350 కిలోమీటర్ల మేరా కొనసాగింది. ఈ బైక్యాత్రకు సారపాకలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, కొనకంచి శ్రీనివాస్, బసంతీదేవి, సానికొమ్ము శంకర్రెడ్డి, బాలి శ్రీహరి, ఆంజనేయులు తదితరులు స్వాగతం పలికారు.

విద్య, ఉపాధి కోసం పోరాడుదాం



భద్రాచలంఅర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న సీపీఐ పట్టణ కార్యదర్శి సునీల్

భద్రాచలంఅర్బన్: విద్య, ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా యువత పోరాడాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్కుమార్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలో ఆయన బుధవారం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. నాయకులు మురాల డానియల్ ప్రదీప్, మారెడ్డి గణేష్, భరణి హరీష్, కొలిపాక శివ, వంకపాటి తిరుపతి, పృథ్వీ, జాగు సాయిరాం, సాయి నాగరాజు, షేక్ అబ్దుల్ ఖాదర్, నగేష్, వింజం సాయి, అలవాల సీతారాంరెడ్డి, అయినాల రామకృష్ణ, లంకపల్లి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో ఐఎన్టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెలగపల్లి జాన్ యూనియన్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. సింగరేణి పరిరక్షణకు రాబోయే గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు టి.రాజలింగు, పెదనాగయ్య, సహదేవ్, భీమరాజు, భద్రం, వెంకన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: సీపీఐ అనుబంధ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. దమ్మపేటలో యువ నాయకులు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వమే ఉపాధి కల్పించాలని, లేనియెడల నిరుద్యోగ భృతిగా రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తంగెళ్ల మూడి శివ, ధర్మ, దస్తగిరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ శిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా ఉద్యోగుల పిల్లలకు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా వేసవిలో పిల్లలకు ఉచిత క్రీడా శిక్షణా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో భాగంగానే ఈ ఏడాది ఈ నెల 4న సాయంత్రం 5గంటలకు పీవీకాలనీ భద్రాద్రి స్టేడియంలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు సింగరేణి ఉద్యోగుల 18 సంవత్సరాల లోపు బాలబాలికలకు పలు క్రీడల్లో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించబడుతాయని, అవి ఈ నెల 27 వరకు కొనసాగుతాయిన తెలిపారు.

శ్రీరామ్మూర్తికి అభినందన

దమ్మపేట: కార్మిక నాయకుడిగా ప్రభుత్వం నుంచి అవార్డు పొందిన జుజ్జూరపు శ్రీరామ్మూర్తి బుధవారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అభినందించారు. శ్రీరామ్మూర్తి తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలవగా.. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నుంచి అవార్డు పొందడంపై ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో చిప్పనపల్లి శ్రీను, జుజ్జూరపు రాంబాబు, క్రాంతికుమార్ పాల్గొన్నార కటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీకాలనీలో సింగరేణి సంస్థ కార్మికులకు క్వార్టర్ల కేటాయింపునకు సంబంధించి బుధవారం ఏరియా అధికారులు ఎంవీటీసీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్వోటూ జీఎం డి.లలిత్కుమార్ మాట్లాడుతూ.. 15 క్వార్టర్స్కు గాను 24మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, డి.వీరభద్రం, జూనియర్ అసిస్టెంట్ శైలజలు పాల్గొన్నారు.

పాలాభిషేకం

బూర్గంపాడు: మేడే సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి సారపాక ప్రధాన కూడలిలో గ్రామపంచాయతీ కార్మికులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

మణుగూరుటౌన్: బొంబాయి కాలనీ కూనవరం రైల్వేగేట్ నుంచి బొంబాయి కాలనీ మహాత్మాగాంధీ బొమ్మ సెంటర్ వరకు ఉన్న సింగిల్ రోడ్డును వెడల్పు చేసి మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. బుధవారం కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు ఎస్డీ.నాజర్ పాషా విలేకరులతో మాట్లాడుతూ.. బొంబాయి కాలనీ రోడ్డు పూర్తిగా గుంతల మయమైందన్నారు. కాలనీ వాసులు అంజయ్య, ఎండీ ఆహ్మద్, శ్రీనివాస్, యాకయ్య, శాంతయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్



గ్రామస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

దమ్మపేట: మండల పరిధిలోని రాచూరుపల్లి గ్రామంలో సీఐ బాలకృష్ణ నేతృత్వంలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇటీవలే నాటుతుపాకీ పేలి గిరిజన యువకుడు మరణించిన సంఘటన ఆధారంగా తుపాకీ లాంటి ఆయుధాల కోసం రాచూరుపల్లి గ్రామంలోని ప్రతి ఇంటినీ పోలీసులు జల్లెడ పట్టి గాలించారు. అనంతరం గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వన్య ప్రాణుల చట్టం ప్రకారం వేటకు వెళ్లడం నేరమని, అలాగే నాటు తుపాకీ లాంటి ఆయుధాలు కలిగి ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్లో ఎస్సైలు శ్రావణ్కుమార్, రాజేష్కుమార్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోజుకూలి రూ.600 ఇవ్వాలి



అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: ఉపాధి హామీ సమస్యలపై బుధవారం అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ విల్సన్కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ.. కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 చొప్పున కూలీలకు వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)ప్రజాపంథా పార్టీ నాయకులు వాసం బుచ్చిరాజు, పేతు చిన్న, లక్ష్మీ, నసమ్మ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ఉపాధి హామీ కార్మికులకు రోజుకూలి రూ.600 ఇవ్వాలని ప్రజాపంథా డివిజన్ నాయకుడు సాయన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ప్రగతిశీల కార్మిక సంఘం ఆధ్వర్యంలో ములకపాడు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ కార్మికులకు 2022లో పెండింగ్లో ఉన్న కూలి డబ్బులు ఇవ్వాలని, పని ప్రదేశంలో హెల్త్ వర్కర్, మెడికల్ కిట్టు, టెంటు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వీరభద్రం, పాయం వెంకటేశ్వర్లు, కారం ముత్యాలక్క, పర్శిక వీరమ్మ, సోందే లక్ష్మి, మీడియం వీరమ్మ, యాకోబు, సురేష్, ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సంక్షేమ నిధిపై అవగాహన

మణుగూరురూరల్: టీఎస్యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ నిధిలో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు సభ్యులుగా చేరాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు షేక్ మీరాహుస్సేన్ కోరారు. బుధవారం యుటీఎఫ్ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ నిధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మీరాహుస్సేన్ మాట్లాడుతూ.. సభ్యుల్లో ఎవరికైనా ప్రమాదం జరిగితే బాధిత కుటుంబానికి అత్యవసరంగా కుటుంబ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం చేసేందుకు యూటీఎఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశామని, సంబంధిత ఆర్థిక సాయానకి సంఘంలోనూ నిధిలోనూ సభ్యత్వం ఉండాలన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు స్వరూప, జిల్లా కార్యదర్శి రాములు మొదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కారం సీతారామయ్య, ఉపాధ్యక్షురాలు టి.విజయలక్ష్మి, డాక్టర్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చివరిగింజ వరకు కొనుగోలు చేయాలి



ములకలపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

ములకలపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని ధాన్యం కల్లాలను బుధవారం ఆయన సందర్శించి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లుతో మాట్లాడి.. సమగ్ర పంట నష్ట సర్వే చేయించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లారీలు ఏర్పాటుచేసి, చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య, సీపీఐ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, టీఎన్నార్ ట్రస్ట్ కో–ఆర్డినేటర్ నడిపల్లి నవీన్కుమార్రావు, కాంగ్రెస్ నాయకులు సోయం చిన్నారి, బుగ్గారపు సత్యనారాయణ, జహీర్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: అనారోగ్యంలో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ దళిత మహిళకు అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన గాదె మాధవరావు చేయూతనునిచ్చారు. ఏపీలోని చింతూరు మండలాని ఓ మహిళ భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. మాధవరావు బుధవారం ఆమెను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు.

శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, గ్రామపెద్దలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న సీతారామచంద్రస్వామి ఆలయం నిర్మాణానికి బుధవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన మహోత్సవంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, వైస్ ఎంపీపీ వీరభద్రం, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, నెల్లిపాక పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం ర్యాలీ

గుండాల: గత ఆరు నెలలుగా జీసీసీ బంక్లో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని, ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చూస్తూ.. బుధవారం మండల కేంద్రంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు పెండెకట్ల పెంటన్న, గడ్డం లాలయ్య మాట్లాడుతూ.. కొన్ని రోజుల్లో వ్యవసాయ సీజన్ రాబోతోందని, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, అరెం నరేష్, యాసారపు వెంకన్న, పర్శిక రవి, ఈసం కృష్ణ, రియాజ్, లాలు, పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరినగర్లో ఉన్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ. 5 వేల నగదు, రెండు బైక్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

కారు మబ్బులు.. జల్లులు

తుపాను ఫలితంగా ఒక్కసారిగా పలు ప్రాంతాల్లోని వాతావరణంలో మార్పులు వచ్చాయి. బుధవారం మధ్యాహ్నం ఆకాశం నల్లటి మబ్బులతో కమ్మేసి.. ఆపై గాలితో జడివాన కురిసింది. మబ్బులు పట్టినప్పటికే అలర్టైన రైతులు.. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, వరి పంటను రక్షించుకునేందుకు బరకాలను కప్పారు. కొందరు రైతులకు అది సాధ్యపడలేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. అటు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ ధాన్యం బస్తాలను కాపాడుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. – సాక్షి నెట్వర్క్



దుమ్ముగూడెం: ఆకాశాన్ని కమ్మేసిన మబ్బులు



కరకగూడెం: ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



దుమ్ముగూడెం: రైతులకు సాయంగా ధాన్యంపై బరకాలు కప్పుతున్న జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ